క్లుప్తంగా

నక్కపల్లి సీఐగా విజయ్‌కుమార్


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ

నక్కపల్లి : నక్కపల్లి సర్కిల్ సీఐగా అంబటి విజయ్ కుమార్ నియమితులయ్యారు. బుధవారం ఆయన నక్కపల్లి స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే ప్రభుత్వం నక్కపల్లిని సర్కిల్ స్టేషన్‌గా అప్‌గ్రేడ్ చేసింది. ఈ స్టేషన్‌కు సీఐగా శ్రీకాకుళం జిల్లాలో పనిచేస్తున్న విజయ్‌కుమార్‌ను నియమించడంతో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ నక్కపల్లి పరిధిలో శాంతిభద్రతల సమస్యలు పరిష్కరించేందుకు అన్ని వర్గాల వారిని సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ పెట్టడం జరుగుతుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కోడిపందాలు, పేకాట, బెల్టు షాపుల నిర్వహణ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ సందర్భంగా సీఐకు స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

లిప్ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


విద్యార్థులతో మాట్లాడుతున్న తిమ్మరాజుపేట స్కూల్ కాంప్లెక్స్ ప్రతినిధి అప్పారావు

మునగపాక : విద్యార్థుల్లో అభ్యసన మెరుగుదల (లిప్) కార్యక్రమంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని తిమ్మరాజుపేట స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ గాలి అప్పారావు కోరారు. 6,7,8 తరగతులు చదువుకుంటున్న విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించేందుకు లిప్ కార్యక్రమం నిర్వహించారు. తన పరిధిలోని పాఠశాలల్లో లిప్ పనితీరును పరిశీలించడానికి వచ్చిన అప్పారావు ఇక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఉండే అభ్యసన సామర్థ్యాలను తెలుసుకునే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ రీసోర్స్ పర్సన్ కర్రి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సూర్యనారాయణ మాస్టారు సేవలు ఆదర్శప్రాయం


సూర్యనారాయణ మాస్టారును సన్మానిస్తున్న మూలకొత్తూరు గ్రామస్తులు

రాంబిల్లి : మూలకొత్తూరు హెచ్‌ఎం ఎస్.వి. సూర్యనారాయణ మాస్టారు సేవలు ఆదర్శప్రాయమని మూలకొత్తూరు గ్రామస్తులు కొనియాడారు. సూర్యనారాయణ బుధవారం స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయునిగా, ఏపీటీఎఫ్ మండల, జిల్లా అధ్యక్షునిగా ఎనలేని సేవలందించారని పేర్కొన్నారు. సూర్యనారాయణ మాస్టారు భార్య శారద గోకివాడ సర్పంచ్‌గా, వైఎస్సార్‌సీపీ నాయకురాలిగా ఉన్నారు. రాజకీయాల్లోకి రావాలన్న ఆకాంక్షతో ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసరావు, అప్పాజీ, కామరాజు, ధనుంజయ్ పాల్గొన్నారు.

మునగపాక ఎస్‌ఐగా ప్రసాదరావు


బాధ్యతలు చేపడుతున్న ప్రసాదరావు

మునగపాక : మునగపాక ఎస్‌ఐగా పి.ప్రసాదరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీసు అధికారుల బదిలీల్లో భాగంగా ఇంతవరకు మునగపాక ఎస్‌ఐగా పనిచేసిన మహమ్మద్ అలీ షరీఫ్‌ను అనకాపల్లికి బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఎస్.రాయవరం ఎస్‌ఐగా సేవలందించిన ప్రసాదరావును మునగపాకకు బదిలీ చేశారు. ఈ మేరకు తన చాంబర్‌లో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండడంతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ప్రసాదరావును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పోలీసు సిబ్బంది కూడా ప్రసాదరావుకు స్వాగతం పలికారు.

ఇది కదా అభివృద్ధి

అద్దంలా రహదారులు

- మండలంలో రూ.7.39 కోట్లతో ప్రధాన రహదారుల నిర్మాణం


మునగపాక నుంచి కశింకోటకు వెళ్లే రోడ్డు

మునగపాక : ఒకవైపు సంక్షేమం మరో వైపు గ్రామాల్లో అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యం. ఇందుకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి తోడు. గత టీడీపీ హయాంలో రహదారులు అధ్వానంగా ఉండేవి. రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతూ వచ్చేవారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. మండల వ్యాప్తంగా పలు చోట్ల పక్కారోడ్లు నిర్మించారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న రహదారి త్వరలో అభివృద్ధికి నోచుకోనుంది.

బెల్లం రైతులకు తప్పిన ఇక్కట్లు

మునగపాక మెయిన్‌రోడ్డు నుంచి కశింకోట మండలం వెదురుపర్తి వరకు గతంలో రహదారి ఉండేది. ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడేవారు. రైతులు వ్యవసాయ కమతాల నుంచి తాము తయారు చేసిన బెల్లాన్ని మార్కెట్‌కు తరలించేందుకు అవస్థలు పడాల్సి వచ్చేది. రోడ్డు సదుపాయం బాగోలేక పడరాని పాట్లు పడేవారు. దీనికి తోడు మునగపాక నుంచి కశింకోటకు వెళ్లేందుకు అనకాపల్లి బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లాల్సి వచ్చేది. 12 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వచ్చేది.సమస్య పరిష్కారానికి రూ.4 కోట్ల 86 లక్షల మేర నిధులు కేటాయించి మునగపాక నుంచి వెదురుపర్తికి రహదారి నిర్మించారు.

ఐదు గ్రామాలకు మార్గం సుగమం

ఏళ్ల తరబడి పాటిపల్లి బీసీ కాలనీ నుంచి కాకరాపల్లి మీదుగా రాజుపేటకు వెళ్లేందుకు రహదారి నిర్మిస్తామంటూ గత టీడీపీ హయాంలో నేతలు చెప్పుకొచ్చేవారు. ఈ మార్గం గుండా రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడేవారు. వర్షాకాలంలో పడరాని పాట్లు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సమస్యను అధిగమించేందుకు పంచాయతీ రాజ్ విభాగం నుంచి రూ.2.53 కోట్లతో తారురోడ్డు నిర్మించారు. నేడు ఈ రోడ్డు అద్దంలా దర్శనమిస్తుంది. పాటిపల్లి, గొల్లపేట, కాకరాపల్లి, రాజుపేట, పాటిపల్లి బీసీ కాలనీ వాసులు ఈ రోడ్డు నిర్మాణం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది.


రాజుపేట నుంచి పాటిపల్లి బీసీ కాలనీకి వెళ్లే బీటీ రోడ్డు

ప్రయాణం సుఖమయం



గ్రామీణ రహదారులు టీడీపీ హయాంలో అధ్వానంగా ఉండేవి. రాకపోకలు సాగించేందుకు ఇబ్బందుల పడాల్సి వచ్చేది. నేడు రహదారులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో రహదారి సమస్య తీరింది. వాహనాలపై రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉండేలా బీటీ రోడ్డు నిర్మించారు. ప్రయాణం కూడా సుఖంగా ఉంది.

–భీశెట్టి జోగినాయుడు, ద్విచక్ర వాహనదారుడు, గొల్లపేట

బీటీ రోడ్డుతో సమయం ఆదా



మునగపాక నుంచి వెదురుపర్తి వరకు గతంలో ఉన్న రహదారి అధ్వానంగా కనిపించేది. దీంతో ఈ మార్గంలో ప్రయాణం ఇబ్బందికరంగా ఉండేది. బెల్లం తయారు చేసే రైతులు మార్కెట్‌కు బెల్లాన్ని తరలించేందుకు రోడ్డు సదుపాయం బాగోలేక ఇబ్బందులు పడేవారు. నేడు బీటీ రోడ్డు వేయడంతో ప్రయాణం సాఫీగా సాగుతుంది. దీనికి తోడు సమయం కూడా ఆదా అవుతుంది.

–బుద్ద వెంకట్, రైతు, మునగపాక

తిరుపతిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


తిరుపతిలో మునగపాకకు చెందిన పూర్వ విద్యార్థులు

మునగపాక : మునగపాకకు చెందిన పలువురు పూర్వ విద్యార్థులు కలియుగ దైవం తిరుపతిలో ఆత్మీయ కలియక ఏర్పాటు చేశారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో 1984–85లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి పిక్నిక్‌లో భాగంగా తిరుపతిలోని శ్రీనివాసుని దర్శనం చేసుకొని బుధవారం అక్కడే ఆత్మీయ సమావేశం నిర్వహించారు. స్థానికంగా ఏటా ఆత్మీయ సమావేశాలు నిర్వహించుకుంటున్న సంబంధిత బ్యాచ్ విద్యార్థులు ఈ ఏడాది కుటుంబ సభ్యులతో కలిసి పుణ్యక్షేత్రమైన తిరుపతిలో కలుసుకున్నారు. ఇటువంటి కలయికలు ఎంతో సంతోషాన్ని ఇస్తాయని పూర్వ విద్యార్థులు మళ్ల గోవింద్, పెంటకోట రాము, జల్లేపల్లి కృష్ణారావు, ఆడారి బాపునాయుడు, వెలగా ధర్మసూరి తెలిపారు.

గ్రామాల్లో సమస్యలు సత్వరం పరిష్కరించండి


మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ

పాయకరావుపేట : మండలంలో గల ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ అధికారులను కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మండల స్త్రీ భక్తి భవన్‌లో నిర్వహించారు. ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గోపాలపట్నం సర్పంచ్ పన్నీరు బాబ్జి మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది ఈకెవైసీ పూర్తిస్థాయిలో నిర్వహించలేదన్నారు. పాల్మన్‌పేట గ్రామంలో తాగునీరు సమస్య సత్వరమే పరిష్కరించాలని ఆ గ్రామ సర్పంచ్ కోడ కోటేశ్వరరావు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను కోరారు. గత మండల పరిషత్ సమావేశంలో చర్చించిన అంశాలను ఎంతవరకు పరిష్కరించారని మండల కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు, సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని, ఆర్థికంగా ఇబ్బంది అవుతుందని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభకు తెలియజేశారు. సాగు నీటి కాలువలకు డివిజన్ డామ్‌లు, తలుపులు ఏర్పాటు చేయలేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మత్స్యకార గ్రామాల్లో మత్స్యకారులకు సొసైటీ ఏర్పాటును పునరుద్ధరించాలని మత్స్యశాఖ అధికారిని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను కోరారు. మత్స్యకారులకు పింఛను మంజూరు విషయమై ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించాలని మత్స్యకార నాయకులు కోడ కోటేశ్వరరావు, చోడిపల్లి శ్రీను సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయతీరాజ్ డిఈ వై.హరి పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి


సురక్ష శిబిరంలో కంటి పరీక్షలు

యలమంచిలి : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని యలమంచిలి మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీ పాత వీధి ప్రభుత్వ పాఠశాలలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆరోగ్య సురక్ష శిబిరంలో వృద్ధులు, మహిళలు వచ్చి కంటి పరీక్షలు, వైద్య పరీక్షలు, బీపీ,రక్త పరీక్షలు చేయించుకున్నారు.ప్రభుత్వం అందిస్తున్న మందులను తీసుకుని వైద్యుల సూచనలు సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైద్య బృందంతో జగనన్న వైద్య శిబిరం ఆవశ్యకత గురించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందజేస్తున్న సందేశాన్ని టీవీ ప్రసారం ద్వారా అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గతంలో వైద్యసేవలు పొందని వారు దీర్ఘకాలిక వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చూపకుండా వైద్య శిబిరాలకు వచ్చి ఉచితంగా వైద్య సేవలు పొందాలని సూచించారు.

హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష తగదు


సమావేశంలో మాట్లాడుతున్న స్టిగ్మా సంస్థ జిల్లా రిసోర్స్ పర్సన్ గోవిందరావు

యలమంచిలి రూరల్ : హెచ్‌ఐవీ ఎయిడ్స్ సోకిన బాధితుల పట్ల వివక్ష కనబర్చకూడదని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. బుధవారం యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో స్టిగ్మా రిడక్షన్ యాక్టివిటీ (హెచ్‌ఐవీ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష, చిన్నచూపు ఉండరాదు) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే హెచ్‌ఐవీ ఎయిడ్స్ వ్యాప్తి బాగా తగ్గుముఖం పట్టిందన్నారు. లింక్ వర్కర్ స్కీమ్ జిల్లా రిసోర్స్ పర్సన్ ఎస్.గోవిందరావు మాట్లాడుతూ పీఎల్ హెచ్‌వీకి సంబంధించిన 2017 యాక్ట్ గురించి వివరించారు. అనంతరం హెచ్‌ఐవీ బాధితులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఏఎస్ఐ సీహెచ్ త్రినాథరావు, మెడికల్ ఆఫీసర్ వేదవ్యాస్, సర్పంచ్ రాజబాబు, ఐసీటీసీ కౌన్సిలర్ హస పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు

ఎస్.రాయవరం : ప్రభుత్వం ఇంటివద్దకే వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేసిందని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్వసిద్ధి వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. మండల కేంద్రంలో ఫ్యామిలీ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య శిబిరం నిర్వహించి సుమారు 60 మంది వరకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇంటి వద్ద కదల్లేని స్థితిలో ఉన్న వారి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించారు.

రోడ్డు మరమ్మతు కోరుతూ సంతకాల సేకరణ

అచ్యుతాపురం : అచ్యుతాపురం–అనకాపల్లి రహదారిని మరమ్మతు చేయాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం సంతకాల సేకరణ నిర్వహించారు. పారిశ్రామిక వాడగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో రోడ్డు సమస్య కీలకంగా మారిందని అన్నారు.

నూతన ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ


ఎస్‌ఐ విభీషణరావు

ఎస్.రాయవరం : మండల ఎస్‌ఐగా ఎ.విభీషణరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ ప్రసాదరావు ముకగపాక మండలం బదిలీ కాగా నక్కపల్లి మండలంలో పనిచేసే ఎస్‌ఐ విభీషణరావు ఇక్కడకు బదిలీ అయ్యారు. ఆయనకు స్థానిక పోలీసు సిబ్బంది స్వాగతం పలికి అభినందలు తెలియజేశారు.

రెండు గ్రామాల్లో నేడు ఎమ్మెల్యే పర్యటన

రాంబిల్లి: వెంకటాపురం, గోకివాడ గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు వెంకటాపురంలో తడి , పొడి చెత్త బుట్టలను అందజేయనున్నారు. 11 గంటలకు గోకివాడ గ్రామంలో నిర్వహించే ఎస్.వి.సూర్యనారాయణ మాస్టారు సన్మాన సభకు హాజరుకానున్నారు.

మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్‌గా లక్ష్మి

మునగపాక:మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్‌గా సీహెచ్ లక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు సీనియర్ అసిస్టెంట్‌గా సేవలందించిన రవికుమార్‌ను మెప్మాకు బదిలీ చేయడంతో పరవాడ మండల పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన లక్ష్మిని మునగపాక మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ చేశారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

నేవీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా శిబిరంలో శ్రీనివాసరావు

రాంబిల్లి : నేవీ నిర్వాసితుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బి. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన పెదకలవలాపల్లిలో నిర్వహిస్తున్న ధర్నా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. నేవీ ప్రహరీ పనుల కారణంగా పెదకలవలాపల్లి గ్రామస్తులకు ఇబ్బందులు కలుగుతాయని ఆయా గ్రామస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ దేముళ్ల పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి సర్వే రికార్డుల తనిఖీ


పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న జేడీ దేవసాగర్

పాయకరావుపేట : స్థానిక పీహెచ్‌సీ పరిధిలో వైద్య సిబ్బంది సర్వే చేసిన కుష్టు వ్యాధి రికార్డులను ఎస్ఎల్‌ఈపి, జేడీ డాక్టర్ దేవసాగర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ మధ్య కాలంలో వైద్య సిబ్బంది కుష్టు వ్యాధి పై తనిఖీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు స్థానిక వ్యాధులు డాక్టర్ సుభాష్ తెలిపారు. ఈ రికార్డులను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈయనతో పాటు జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ బాలాజీ, పీహెచ్‌సీ వైద్యులు సౌందర్య, వైద్య సిబ్బంది ఉన్నారు. కుష్టు వ్యాధి నివారణ చర్యల పై వైద్య సిబ్బంది తగు సూచనలు, సలహాలు అందించారు.

నేడు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

ఎస్.రాయవరం : సర్వసిద్ధి పీహెచ్‌సీలో గురువారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్టు వైద్యాధికారి శక్తి ప్రియ తెలిపారు. ఆస్పత్రి నూతన భవనం నిర్మాణం చేసిన తరువాత తొలి సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం నాడు నేడు పథకంలో రూ.2 కోట్లు వెచ్చించి నూతన భవనం నిర్మాణం చేపట్టిందని తెలిపారు. ప్రతి ఏడాది అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించి మరిన్ని అవసరమైన సదుపాయాలు కల్పించనున్నట్టు చెప్పారు.

ఎన్నికలకు సమాయత్తం కావాలి

- త్వరలో గ్రామాల్లో విస్తృత స్థాయి పర్యటనలు
- ఓట్లు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది
- పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు
- నాలుగు మండలాల ముఖ్య నాయకులతో సమావేశం


ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త కంబాల జోగులు

నక్కపల్లి : ఇటీవల భీమిలిలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన బహిరంగ సభ విజయవంతం కావడంతో దీన్ని స్ఫూర్తిగా తీసుకుని పార్టీ శ్రేణులంతా ఎన్నికలకు సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. బుధవారం అడ్డురోడ్డులోని క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల ముఖ్యనాయకులు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగులు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో పాయకరావుపేట నియోజకవర్గంలో గతంలో కంటే రెట్టింపు మెజార్టీతో విజయం సాధించడానికి మీ అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల్లోను పర్యటించి కార్యకర్తలను కలసి ఎన్నికలకు సిద్ధం అయ్యే కార్యక్రమాన్ని రూపకల్పన చేద్దామన్నారు. ప్రతి గ్రామంలోను పర్యటించి పార్టీకి కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలను కలవడం జరుగుతుందన్నారు. కార్యకర్తలే పార్టీకి అండదండ అన్నారు. ప్రజలను ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉందని అన్నారు.

వచ్చే నెల 2వ తేదీ నుంచి గ్రామస్థాయి పర్యటనలు చేసి కార్యకర్తలు, నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులను పరిచయం చేసుకోవడం, గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. ఒక్కో మండలంలో ఐదు రోజుల పాటు ఈ పర్యటనలు ఉంటాయన్నారు. ప్రతి గ్రామంలోను గంట పాటు కేటాయించి కార్యకర్తలు, నాయకుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఎస్.రాయవరం మండలం నుంచి ఈ పర్యటన ప్రారంభించి వరుసగా కోటవురట్ల, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో కొనసాగుతుందన్నారు. నక్కపల్లి నుంచి కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ కుటుంబంలో సమస్యల మాదిరిగా పార్టీ సభ్యుల్లో ఏమైనా చిన్న చిన్న విభేదాలుంటే అందరూ సర్దుకుపోయి పార్టీ గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలన్నారు. టీడీపీ, జనసేన, కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్టులు మనపై దండయాత్ర చేస్తున్నాయన్నారు. అందరూ ఒకట్టై వైఎస్సార్‌సీపీపై కుట్రలు పన్నుతున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మనం క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి కార్యకర్తల్లో మరింత ఉత్తేజం నింపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్షాలన్నింటినీ ఎదుర్కొని మనం విజయం సాధించాలంటే అందరం కలిసి కట్టుగా పోరాటం చేయాల్సి ఉంటుందన్నారు. దీనికనుగుణంగా ప్రణాళిక రూపకల్పన చేయాలన్నారు.

ఆయా సమావేశాల్లో జిల్లా వ్యవసాయమండలి చైర్మన్, పాయకరావుపేట మండల శాఖ అధ్యక్షుడు చిక్కాల రామారావు, నక్కపల్లి జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షులు మణిరాజు, పొడగట్ల పాపారావు, యలమంచిలి తాతబాబు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, మండల కోఆప్షన్ సభ్యుడు చంద్రరావు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ గోవిందు, సింహాచలం దేవస్థానం బోర్డు సభ్యురాలు శేషారత్నం, అలాగే ఎస్.రాయవరం మండల పార్టీ అధ్యక్షుడు వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, కోటవురట్ల మండల పార్టీ అధ్యక్షుడు కిషోర్, వైఎస్సార్‌సీపీ నేతలు ధనిశెట్టి బాబూరావు, శ్రీపతి రాజు, పోలిశెట్టి పెదఈశ్వరరావు, పబ్లిక్ వింగ్ అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, పైలా రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరి శ్రీను, ఎంపీపీ ఇసరపు తాతారావు, ఎస్సీ సెల్ జోనల్ అధ్యక్షుడు కంబాల సందీప్, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ అల్లాడ నాగరాజు, దోసపాత్రుని అంజి, పాయకరావుపే జెడ్పీటీసీ లంక సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు


మునగపాకలో సారె ఊరేగింపులో మహిళలు


గౌరీపరమేశ్వరులను దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: మునగపాక గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. గౌరీ పరమేశ్వరుల ఉత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన సారె ఊరేగింపులో ప్రదర్శించిన పలు రకాల పిండి వంటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ, కార్యదర్శి అప్పలనాయుడు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరేగింపులో మహిళలు, పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. గౌరీ పరమేశ్వరులను వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ దర్శించుకొన్నారు.